క్లుప్తంగా...

బుక్ ద పార్టీ వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటులు, మోడల్స్

బంజారాహిల్స్: దేశ వ్యాప్తంగా కార్పొరేట్ ఈవెంట్లు, సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం బుక్ ద పార్టీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుక్ ద పార్టీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సినీ తారలు ఖుషితా కల్లపు, శ్రీలేఖ, మోడల్స్ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా వివిధ సంస్థలతో ఏర్పర్చుకున్న సంబంధాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు కృష్ణ మొలుగు, సంతోష్ మొలుగు, కిరణ్ కూరపాటి వెల్లడించారు. కార్యక్రమాలు నిర్వహించుకునే సంస్థలు తమ వెబ్‌సైట్‌లోనూ, ఫోన్ ద్వారానూ, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ద్వారా కూడా సంప్రదించే అవకాశాన్ని కల్పించామన్నారు.

38 మంది వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ 38 మంది వాహనదారులను బుధవారం నాంపల్లిలోని 10వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరందరికీ జరిమానాలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానాల రూపంలో వీరి నుంచి రూ. 38,200 వసూలు చేసినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

నేత్రదానం చేసిన రిటైర్డ్ లేబర్ జాయింట్ కమిషనర్

బంజారాహిల్స్: కుల నిర్మూలన సంఘం వ్యవస్థాపక సభ్యుడు, రిటైర్డ్ లేబర్ జేసీ, ప్రముఖ సోషల్ వర్కర్ టీవీ దేవదత్(85) బుధవారం తెల్లవారుజామున గాంధీనగర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్రనిధికి డొనేట్ చేశారు. నగరానికి చెందిన అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం నేతృత్వంలో ఆయన నేత్రాలను సదరు సంస్థకు అందజేశారు. సమాజహితం కోసం తన నేత్రాలను మరొకరికి వెలుగులు ఇవ్వాలనే సదుద్దేశంతో దేవదత్ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల బంధుమిత్రులతో పాటు సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మరింత మందికి మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు.

కాంగ్రెస్ యూసుఫ్‌గూడ అధ్యక్షుడిగా సురేందర్ యాదవ్



సురేందర్‌ను అభినందిస్తున్న విష్ణు

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నేత సురేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డిని బుధవారం సురేందర్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. విష్ణు నూతన కార్యవర్గానికి పూలబొకేను అందించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు అఫ్జల్‌ఖాన్, వెంకటేష్, రవి యాదవ్, సతీష్ దాస్, షౌకత్‌అలీ, సలీంజావెద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి

పంజగుట్ట: మహిళలకు అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్రీయ నారీ సమాజ్ డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడలోని కార్యాలయంలో నారీ సమాజ్ అడహక్ కమిటీ అధ్యక్షురాలు చెంగయ్య లక్ష్మి, ఉపాధ్యక్షురాలు జి.శాంత కుమారి మాట్లాడుతూ... అన్ని రంగాల్లో మహిళలు సమానం అంటున్నప్పుడు రాజకీయాల్లో మహిళలకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వరని ప్రశ్నించారు. తాము ఏ పార్టీకి అనుకూలం లేదా వ్యతిరేకం కాదన్నారు. అన్ని పార్టీల అధ్యక్షులను కలుస్తామని తెలిపారు. మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలని వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. అన్ని పార్టీల్లోని మహిళలను నారీ సమాజ్‌లో కలుపుకొని ఉద్యమిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. తెలంగాణలో మొదలైన తమ ఉద్యమం త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. సెక్రటరీ జి.స్వరూప, జాయింట్ సెక్రటరీలు స్నేహారెడ్డి, శోభారాణి, కోశాధికారి సుజాత, అడ్వైజరీ కమిటీ సభ్యురాలు బోనం ఊర్మిళ పాల్గొన్నారు.

దోమలపై యుద్ధం!

పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఆదివారం అవగాహన

చెరువుల్లో పేరుకుపోతున్న వ్యర్థాల తొలగింపు

బస్తీలు, కాలనీల్లో పెద్ద ఎత్తున ఫాగింగ్



వెంగళ్‌రావు పార్కు చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

వానాకాలం ప్రారంభమైంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున ఎంటమాలజీ విభాగం అధికారులు అప్రమత్తం అయ్యారు. దోమల నివారణకు యుద్ధం ప్రకటించారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ దోమల బారినుంచి కాపాడుకునేందుకు పటిష్ట చర్యలు తీసుకునేలా చేస్తున్నారు.

బంజారాహిల్స్: దోమల నివారణ కోసం వారం రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని సీఎంటీసీ శిక్షణా కేంద్రంలోని వివిధ సర్కిళ్ల ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది, ఫాగింగ్ విభాగం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలను చేశారు. ఇందులో భాగంగా చెరువుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఇప్పటికే సర్కిల్-18 పరిధిలో ఉన్న బంజారాహిల్స్ తాజ్ బంజారా లేక్, జలగం వెంగళ్‌రావు పార్కు చెరువు, లోటస్ పాండ్, కొత్త చెరువులలో సాధారణ పంపింగ్ మిషన్లతో దోమల మందు పిచికారీ చేయడంతో పాటు డ్రోన్ల ద్వారా కూడా నివారుణ మందును స్ప్రే చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, సర్కిల్-17 పరిధిలోని సోమాజిగూడ, ఖైరతాబాద్, సర్కిల్-19 పరిధిలోని యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, వెంగళ్‌రావునగర్, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్మూలన, నిల్వ ఉన్న నీటి సమస్యపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సమస్య నెలకొనకుండా చర్యలు తీసుకుంటున్నారు.

విస్తృతంగా అవగాహన...

ప్రతి సంవత్సరంలానే ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల 10 నిమిషాలకు 10 నిమిషాల పాటు ఎవరికి వారు ఆయా నివాసాలు, పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకునేలా ఇప్పటికే అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దోమలు వృద్ధి చెందకుండా చేయడంలో అధికారులు, సిబ్బంది పాత్ర ఎంత ఉందో స్థానికంగా ఉండే నివాసితుల పాత్ర కూడా అంతే ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నివాసిత ప్రాంతాల చుట్టుపక్కల గుంతల్లో నీళ్ల నిల్వ లేకుండా చేసుకోవాలని ఇప్పటికే ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది కరపత్రాలు ముద్రించి బస్తీల్లో అవగాహన కల్పిస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న భవనాలకు నోటీసులు

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణంలో ఉన్న భవనాల గుంతల్లో వర్షాకాలం నేపథ్యంలో పెద్ద ఎత్తున నీళ్లు నిలిచిపోతాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందడంతో చుట్టుపక్కల ఉన్న బస్తీలు, కాలనీల్లోని ప్రజలు ఎఫెక్ట్ అవుతున్నారు.

- దీన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణాల్లో ఉన్న భవన యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.
- గత ఏడాది బంజారాహిల్స్‌లోని ఓ భారీ నిర్మాణ సముదాయంలో నీళ్లు పెద్ద ఎత్తున నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి పెరిగి ఎన్బీటీ నగర్, ఎమ్మెల్యే కాలనీల్లో డెంగీ తదితర జ్వరాలు వ్యాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై అలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే దానం, తదితరులు

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ వద్ద ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది.

పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో ప్రారంభమైన వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపును ఫిలింనగర్ మొత్తం తిప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ మాల సంఘాల జేఏసీ కో చైర్మన్‌గా శ్రీనివాస్



వెంకటేశ్వరకాలనీ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలతో పని చేస్తున్న పాలడుగు శ్రీనివాస్‌ను తెలంగాణ మాల సంఘాల జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ కో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గ్రేటర్ జేఏసీ కమిటీ చైర్మన్ ఉత్తమ్ సుమన్ నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

వెంగళరావునగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందజేస్తుండగా, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ దండగ అని అనడం సిగ్గుచేటని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలో ఎప్పుడు విద్యుత్ వస్తుందా అని ఎదురు చూసేవారన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24 గంటలు విద్యుత్ ఇస్తూ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నారని అన్నారు. రైతులపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డికి త్వరలోనే రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్, సి.ఎన్.రెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు ముదిరాజ్, వేణుగోపాల్, వేణు, సంతోష్, నర్సింగ్‌దాస్, పవన్ ముదిరాజ్, పూజారి బాల్‌రాజ్, సిరాజ్, షరీఫ్, కిట్టు, అరుణ్, మధు తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు

రహమత్‌నగర్: కమలానగర్ బస్తీలోని అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రకటించారు. 13 మంది కమలానగర్ బస్తీవాసులకు బుధవారం పొజిషన్ సర్టిఫికెట్లతోపాటు ఇళ్ల తాళాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... ఇప్పటి వరకూ కమలానగర్ బస్తీవాసులకు 102 డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించామని గుర్తు చేశారు. ప్రతి పేదకూ డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఆ దిశగా ఆయన చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్ ఆర్డీఓ వసంత, ఖైరతాబాద్ మండల తహసీల్దార్ నవీన్, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నాయకులు దుబాయ్ నజీర్, నాగరాజు, జబ్బార్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు 'బోనాల' శోభ

రహమత్‌నగర్: బోనాల సంబురాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 16న జరిగే బోనాల జాతరకు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలోని అమ్మవారి ఆలయాలు సిద్ధం అవుతున్నాయి. ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు దేవాలయాలకు రంగులు వేయిస్తూ, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయిస్తున్నారు. బోనాలను సమర్పించేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట ఏర్పాటు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద గుంతలు లేకుండా మరమ్మతులు చేపడుతున్నారు.



ఎన్ఎస్‌బీనగర్ అమ్మవారి ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

పాఠశాలల బంద్ ప్రశాంతం

రహమత్‌నగర్: ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయని మండిపడ్డారు. బోరబండలో జూనియర్ కాలేజీని నిర్మించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఇంటర్ బోర్డు కార్యదర్శిని కోరారు. అలాగే అనుమతిలేని ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

దాడికేసులో నిందితుడికి పది రోజుల జైలు శిక్ష

వెంగళరావునగర్: వ్యక్తిపై దాడి చేసిన కేసులో యువకుడికి నాంపల్లి కోర్టు పది రోజుల జైలు శిక్ష విధించింది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో ఉండే షోయబ్‌ఖాన్‌కు ఇటీవల రహమత్‌నగర్ చౌరస్తాలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముక్తార్ అనే వ్యక్తితో గొడవ జరిగింది. ఈ గొడవలో ముక్తార్‌ను షోయబ్‌ఖాన్ దాడిచేసి గాయపరిచాడు. దాంతో క్షతగాత్రుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. బుధవారం నాంపల్లి 10వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ (ఇన్‌చార్జి) ఎస్.లక్ష్మణ్ రావు కేసును విచారించి నిందితుడికి 10 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

జీవో 46తో పోలీసు నియామకాల్లో అన్యాయం

పంజగుట్ట: పోలీసు నియామకాల్లో అన్ని అర్హతలు సాధించినా జీవో నెంబర్ 46 వల్ల తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులను నాన్ లోకల్‌గా గుర్తిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అర్హత సాధించిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించాక 2014, 2018 నియామకాల్లో లేని జీవో 46 ప్రస్తుత ఎంపికలోనే ఎందుకు తీసుకువచ్చారని వారు ప్రశ్నించారు. వెంటనే వేలాది మంది అభ్యర్థులకు అన్యాయం చేసేలా ఉన్న జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు రాజవర్ధన్‌రెడ్డి, మహం, రఘు తదితరులు మాట్లాడారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు మున్సిపల్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ విజ్ఞప్తి చేశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రాస్ కార్మికులు ఎదుర్కొంటున్న పని సమస్యలపై చర్చించేందుకు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రీతం సింగ్ మాట్లాడుతూ... కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, పారిశుద్ధ కార్మికులు, జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు అనేక సమస్యలో సతమతం అవుతున్నారన్నారు. ప్రధానంగా నగరాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు వేతనాలు పెంపు ఇతర సౌకర్యాల కల్పనపై వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ విభాగాల్లో అనేక ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెంపు ఇతర అలవెన్సులు ఉద్యోగ భద్రత సర్వీస్ రెగ్యులరైజన్స్ అంశాలపై కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆచరణ యోగ్యమైన చర్యలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో కమిషనర్ కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవిస్తామని ఆయన వివరించారు.



పెద్దమ్మతల్లి ఆలయం నుంచి ఎమ్మెల్యే మాగంటితో కలిసి వెలుపలికి వస్తున్న హిమాన్షు

పెద్దమ్మతల్లికి హిమాన్షు పూజలు

బంజారాహిల్స్: సీఎం కేసీఆర్ మనుమడు కల్వకుంట్ల హిమాన్షు తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఆయన పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద హిమాన్షును చూసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు సందడి చేశారు. హిమాన్షుతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

చల్లా సోమ్‌రాజ్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్



కుట్టుమిషన్లు, గ్రైండర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: వాసవి సేవాకేంద్రం మాజీ అధ్యక్షుడు చల్లా సోమ్‌రాజ్ జయంతి సందర్భంగా బుధవారం వాసవి సేవాకేంద్రంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యావేత్తగా, వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన స్థాపించిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల దేశంలోనే టాప్ 10లో ఉండటం గర్వకారణమని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్య అందజేయాలనే సంకల్పంతోనే కళాశాల ఏర్పాటుకు కృషి చేశారని చల్లా సోమ్‌రాజ్ కుమార్తె చల్లా ప్రసన్న తెలిపారు. సేవాకేంద్రం అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేదలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లను పంపిణీ చేశారు. వాసవి హాస్పిటల్ ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సేవాకేంద్రం కోశాధికారి పంపాటి జ్ఞాన్ చందర్, ప్రధాన కార్యదర్శి కొల్లూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీయత్నం విఫలం

నిందితుడిని పోలీసులకు అప్పగించిన వాకర్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద చోరీకి యత్నించిన ఓ వ్యక్తిని వాకర్లు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వాకింగ్ కోసం వచ్చిన ఓ వాహనదారుడు తన బైక్‌ను పార్కు ముందు పార్కింగ్ చేసి వాకింగ్‌కు వెళ్లారు. బయటికి వచ్చి చూడగా ఓ యువకుడు డిక్కీ తెరిచి అందులో ఉన్న ఐఫోన్, ఇయర్ పాడ్స్‌ను దొంగిలించేందుకు యత్నిస్తుంటడాన్ని చూసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బంజారాహిల్స్ పోలీసుల సమాచారం మేరకు వివరాలివీ... ఈ నెల 10వ తేదీన ఎం.విజయ్ కుమార్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కేబీఆర్ పార్కుకు సాయంత్రం వాకింగ్‌కు వచ్చి తన బైక్‌ను పార్కు ముందు పార్కింగ్ చేశారు. తిరిగి రాగా ఓ యువకుడు డిక్కీ తెరిచేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నాడు. ఆరా తీయగా ఖాజీపేటకు చెందిన జి.రాజ్‌కుమార్ ఈ దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఐఫోన్‌తో పాటు ఇయర్ పాడ్స్ దొంగిలించేందుకు యత్నించాడని బాధితుడు ఆరోపించారు.

జూదరులకు జైలు శిక్ష

రహమత్‌నగర్: పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారికి న్యాయస్థానం జైలు శిక్ష విధించిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... బోరబండ డివిజన్ అంజయ్యనగర్ రోడ్డు పక్కన పేకాట ఆడుతున్నారనే సమాచారంతో బోరబండ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. జూదం ఆడుతున్న చిదానందాచారి, శివరామకృష్ణ, ధర్మరాజు, శ్యామల్‌రావు, సింహాచలంను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని బుధవారం నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపర్చారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి 14 రోజులు జైలు శిక్ష విధించడంతో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నేడు అండర్సన్ యూనివర్సిటీలో
స్పాట్ అడ్మిషన్లు



బంజారాహిల్స్: ఈ నెల 13వ తేదీన ఆదిత్య పార్క్ హోటల్‌లో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలో ఒక్కటైనా అండర్సన్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమం నిర్వహిస్తున్నదని సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఇవాన్స్ వైటేకర్, డాక్టర్ బెంజిమెన్ బ్రామర్, డాక్టర్ అనిల్ పల్లా వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఐటీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులకు ఈ యూనివర్సిటీలలో తక్షణ ప్రవేశాలు ఇవ్వనున్నామని, ఔత్సాహికులు ఫోన్: 63871 49133లో సంప్రదించవచ్చని తెలిపారు. హాజరైన ప్రతినిధులతో మాట్లాడి వారి దరఖాస్తులను ఖరారు చేసి అవసరమైన ఐ20 డాక్యుమెంట్లను పొందాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అండర్సన్ విశ్వ విద్యాలయం, యూనివర్సిటీ హబ్ మధ్య సహకారం ఉండటంతో విద్యార్థుల ప్రయోజనం కోసం ఈ ప్రక్రియను సులభతరం చేస్తున్నామన్నారు.